# అందరూ ఇలాగ వుంటే.....

విన్నకోట సుశీలాదేవి

ప్రొఫెసరు వ్యాస్ ఇంటి ముందున్న గేటుని తీయబోతూ క్షణకాలం ఆగాడు శ్రీరామ్.

"ప్రొఫెసరుగారు తనని ఇంటికి ఎందుకు రమ్మన్నారో ?" ప్రొద్దుటినుండీ అతడా ప్రశ్న వేసుకోవడం ఏ వెయ్యోసారో అయివుంటుంది.

రోజూలానే — ఉదయం పది గంటలకు యూనివర్శిటీముందు బస్సు దిగాడు శ్రీరామ్.

పది నిముషాల్లో తన డిపార్ట్‌మెంట్‌కి, చేరుకుని — ప్రొఫెసరుగారి రూములోకి వెళ్లాడు.

ఆ సరికి ఆయన ఇద్దరు రిసెర్చి స్కాలర్స్‌తో ఏదో విషయంమీద తీవ్రంగా చర్చిస్తున్నారు.

శ్రీరామ్‌ని చూడగానే ఆయన ముఖంలో వుత్సాహం తొంగి చూసింది.

"రావోయ్ ! శ్రీరామ్ !" అంటూ ఆహ్వానించారు.

శ్రీరామ్ లోపలికెళ్లి ఆయన ఎదురుగా నిలబడ్డాడు.

"వర్క్ ఎలా సాగుతోంది ? "

"ఇంకో నాలుగు రోజుల్లో థీసీస్ సబ్మిట్ చేసేస్తానండీ !" అన్నాడు శ్రీరామ్ ఆనందం, గర్వం మిళితమైన స్వరంతో.

"వెరీగుడ్ ! నీలాటి వుత్సాహవంతుడైన స్టూడెంటు ఒక్కడున్నా చాలు నాకు పేరు రావడానికి !"

ప్రొఫెసరుగారి మాటలకు వుప్పొంగిపోయాడు శ్రీరామ్.

"థాంక్స్ సార్ !"

"సాయంత్రం అయిదు గంటలకొకసారి మా ఇంటికి రా !" అన్నాడాయన !

శ్రీరామ్ కొద్దిగా ఆశ్చర్యపడినా—

"అలాగే సార్! తప్పక వస్తాను!" అన్నాడు వినయంగా.

"సరే ! ఇక నువ్వెళ్లు !"

శ్రీరామ్ వచ్చేశాడు.

ఆ క్షణం నుండీ అతడి మనసులో—ఎన్నో.. అనుమానాలు. సందేహాలు తలెత్తాయి. ప్రొఫెసరుగారు ఎందుకు రమ్మన్నారో ?

రిసెర్చ్ స్కాలర్స్ ఎవరికీ ప్రొఫెసరుగారింటికెళ్లే ధైర్యం లేదు !

ఆయన రమ్మనరు. ఆయనతో ఎవరైనా మాట్లాడాలంటే యూనివర్సిటీలోనే కలవాలి. ఇంటికొస్తే ఆయనకి కోపం. మరి తనని ఆయనంతట ఆయనే రమ్మని పిలిచారు ఎందుకో.

ఆలోచిస్తుండగానే సాయంత్రం అయిదు గంటలయింది. తనింతవరకూ వ్రాసిన నోట్సు కాగితాలన్నీ తీసుకుని ప్రొఫెసరు ఇంటికి బయలుదేరాడు శ్రీరామ్.

తీరా ఇక్కడికి వచ్చాక— లోపనికెళ్ళాలంటే భయంగా వుందతనికి.

"ఎవరు కావాలండీ !"

సన్నని గొంతు అతడి ఆలోచనలను చెదరగొట్టింది.

వులికిపాటుని కప్పిపుచ్చుకుంటూ తలెత్తి చూశాడు. ఇరవై సంవత్సరాల యువతి— చేతిలో బొచ్చుకుక్కతో నిలబడి వుంది.

"ప్రొఫెసరుగారు వున్నారా ?" అనడిగాడు శ్రీరామ్.

"మీ పేరు ... !"

"శ్రీరామ్ !"

"నాన్నగారు మీ కోసమే ఎదురుచూస్తున్నారు !" అంది.

శ్రీరామ్ ధైర్యాన్ని కూడగట్టుకుని—గేటు తీసుకుని లోపలకు వెళ్లాడు.

విశాలమైన లాన్ — మధ్య సన్ననిబాట — ఆ బాటకి ఇటూ అటూ రకరకాల పూలచెట్లు.

మరొకసారి అయితే ఆ తోట అందాన్ని తనివితీరా చూసేవాడు. కానీ ఈ రోజు అతని మనసంతా ప్రొఫెసరుగారు మాట్లాడబోయే విషయం మీదే వుంది.

గబగబా వరండా మెట్లెక్కి హాల్లోకి వెళ్లాడు. సోఫాలో కూర్చుని పేపరు తిరగేస్తున్న ప్రొఫెసరుగారు, శ్రీరామ్‌ని చూస్తూ —

"రావోయ్ ! నీ కోసమే చూస్తున్నా !" అంటూ లేచి మేడమీదికి దారితీశారు.

శ్రీరామ్ ఆయనను అనుసరించాడు.

మేడమీద ప్రొఫెసరుగారి రూములోకెళ్లి కూర్చున్నారిద్దరూ.

ఎ.సి. రూము క్రింద ఎర్రటి కార్పెట్, మెత్తటి సోఫాలు, ఆ చక్కని వాతావరణం శ్రీరామ్‌ని వుక్కిరిబిక్కిరి చేసింది. జేబులోంచి కర్చీఫ్ తీసి ముఖాన పట్టిన చెమట తుడుచుకున్నాడు.

"శ్రీరామ్ నీ రిసెర్చి అయిపోతుందన్నావు కదూ !"

"అవున్సార్ ! నేను వ్రాసిననోట్సు తెచ్చాను చూస్తారా !" ఫైలు తెరిచి ఆయన ముందు పెట్టబోయాడు.

"వద్దులేవయ్యా ! నాకు తెలీదా ! నీ ప్రతిభ ! నీలాటి బెస్ట్‌స్టూడెంట్‌ని నా సర్వీసులో ఇంతవరకూ చూడలేదు! నీకు వచ్చే కాన్వొకేషన్ లోనే డిగ్రీవచ్చేట్టు చూస్తాను," అన్నారాయన.

శ్రీరామ్ ఆనందంతో పొంగిపోయాడు.

ఏమిటిది కలా ! నిజమా ! తనసీనియర్స్‌లో చాలామంది థీసీస్‌లు సబ్మిట్ చేసి సంవత్సరాలయినా ఇంతవరకూ డిగ్రీలు రానేలేదు. తనకి వెంటనే డిగ్రీ వస్తోంది. ఎంత అదృష్టం !

'ఈ విషయం రేపు శోభతో చెప్పాల' అనుకున్నాడు శ్రీరామ్.

"శ్రీరామ్ ! నిన్నెందుకు రమ్మన్నానో ? తెలుసా," జేబులో నుండి పైపుతీసి వెలిగించారు ఆయన.

"తెలీదు సార్."

"మా అమ్మాయి రూప బి. ఎ. పాసయింది. నీలాటి కుర్రాడెవరన్నా దొరికితే ఆమెకిచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను !" గుప్పు గుప్పున పొగ వదులుతూ అన్నారు.

తనకా విషయం ఎందుకు చెప్తున్నాడో శ్రీరామ్‌కి అర్థం కాలేదు. అయినా మౌనంగా వింటూ వుండిపోయాడు.

"శ్రీరామ్ ! నీ పెళ్లి ఎప్పుడోయ్," అడిగారు.

శ్రీరామ్ సిగ్గుపడి జవాబు చెప్పకుండా వూరుకున్నాడు.

"ఎలాగూ నీ రిసెర్చి అయిపోతోంది కదా ! మా అమ్మాయిని నువ్వు చేసేసుకో. నీకు డిగ్రీ కూడా త్వరలోనే వస్తుందిలే !"

"నేనా...!" వెలవెలబోయాడు శ్రీరామ్.. పర్వత శిఖరం మీదనుండి దొర్లి పడుతున్నట్లు అనుభూతి చెందాడు.

"అన్నట్లు ఈ ఏడు మన డిపార్ట్‌మెంట్‌లో ఒక లెక్చరరు పోష్టుకి ఖాళీ వస్తుంది. నీకు పి. హెచ్. డి. డిగ్రీ కూడా వుంది కాబట్టి నీకు రావచ్చు."

శ్రీరామ్‌కి ఆయన మాటల్లో అంతరార్థం బోధపడింది. "వాళ్లమ్మాయిని చేసుకుంటే తను పొందబోయే లాభాలు చెప్తున్నాడు." అనుకున్నాడు.


"శ్రీరామ్ ! అసలు నిన్ను రిసెర్చి స్టూడెంట్‌గా చేర్చుకోడానికి చాలా గొడవయిందిలే ! అప్పటికే నా దగ్గర పదిహేనుమంది వరకూ వున్నారు. వైస్‌ఛాన్సలర్ నిన్ను చేర్చుకోడానికి అభ్యంతరం చెప్పాడు. నేను ప్రత్యేకంగా చెప్పడంవలన చివరికి ఒప్పుకున్నాడు."

అదంతా ఎందుకు చెప్తున్నాడో అర్థం చేసుకున్నాడు శ్రీరామ్.

"మీ ఫాదర్ అడ్రసు చెప్పవోయ్ ! నేను లెటర్ వ్రాస్తాను."

"లెటరా... వొద్దుసార్... ఎందుకంటె... అదికాదు సార్... !" శ్రీరామ్ తడబడిపోతున్నాడు.

తనకు విద్యాదానం చేసిన ప్రొఫెసరుగారికి




ఎలా చెప్పాలో, ఏం చెప్పాలో తెలీక కంగారుపడి పోతున్నాడు.

ఏదో చెప్పాలనుకుంటున్నాడు శ్రీరామ్ కానీ గొంతు పెగలడంలేదు

ఎదురుచూడని సంఘటన జరిగిందే అని బాధ – 'కాదంటే' ప్రొఫెసరు ఏమంటారోనన్న భయం అతని గొంతుకు అడ్డుపడ్డాయి.

గాబరాతో కళ్లల్లో నీళ్లు తిరగసాగాయి.

''ఏమిటి శ్రీరామ్'' ప్రొఫెసరుగారి కనుబొమలు ముడివడ్డాయి. అది చూసిన శ్రీరామ్‌కి చెమటలు పట్టసాగాయి, వణికిపోతున్నాడు.

కానీ తన మనసులోని విషయం చెప్పకపోతే మరీ ప్రమాదం. అందుకే అతికష్టం మీద గొంతు పెగుల్చుకుని --

''సార్ ! నేను మీ అమ్మాయిని చేసుకోలేను. నన్ను క్షమించండి సార్ '' అన్నాడు మెల్లగా !

ప్రొఫెసరుగారి ముఖం ఎర్రబడింది. గుప్పుగుప్పున పొగ వదుల్తూ వుండిపోయారు.

ఇక ఆయన ముందు కూర్చోలేకపోయాడు శ్రీరామ్. ''సార్ ! నేను వెళ్లొస్తాను'' అంటూ తడబడుతూ లేచాడు.

ప్రొఫెసరుగారు మాట్లాడలేదు. రెండు పెదవులూ బిగించి, వెడుతున్న శ్రీరామ్ వేపు తీక్షణంగా చూస్తూ వుండిపోయారు !

* * *

''అలా వున్నావే రామ్'' శోభ అడిగింది.

సాయంత్రం ఆరుగంటల సమయం : శోభ–శ్రీరామ్ పార్కులో తమ యథాస్థానంలో కూర్చున్నారు.

రోజూ గలగలా మాట్లాడే శ్రీరామ్ వచ్చి పావుగంటయినా పెదవి విప్పకుండా – ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుండటం శోభకి ఆశ్చర్యాన్ని కలిగించింది.

''రామ్ ! నిన్నే ! ఎందుకలా వున్నావ్ అనడుగుతున్నాను !'' శోభ అతడి భుజం మీద చెయ్యి వేస్తూ అడిగింది.

శ్రీరామ్ ఆ చేతిని తీసి తన చేతుల మధ్య బంధించాడు.

''శోభా ! ఇటువంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా అనుకోలేదు,'' దిగులుగా అన్నాడు.

''ఏం జరిగింది రామ్ ! నాతో చెప్పవూ!'' లాలనగా అడిగింది శోభ.

''చెప్తాను శోభా ! నీకు కాక ఇంకెవరికి చెప్పుకుంటాను,'' అంటూ – ప్రొఫెసరుగారికి, తనకూ జరిగిన సంభాషణని వివరించాడు.

''నీకిష్టం లేదని చెప్పావు కదా ! ఇంకెందుకు విచారం ?''

''శోభా ! ఈ సంఘటన జరిగి వారం అయింది !''

''మరి ఇన్నాళ్లూ చెప్పలేదే ?''

''దానికి ప్రతిఫలం ఇవ్వాళే అందుకున్నాను !''

''ఏం జరిగింది ?''

''రెండ్రోజుల క్రితం నా థీసిస్ పూర్తిచేసి ఇచ్చాను. కానీ నేను వ్రాసింది సరిగ్గా లేదని – తిరిగి రిసెర్చి కొనసాగించమని ఇవ్వాళే రిమార్క్ వ్రాశారు ప్రొఫెసరుగారు !'' బాధగా అన్నాడు.

శోభ ఆశ్చర్యపోయింది.

''అదేమిటి, నీ రిసెర్చ్‌ని ఎంతో మెచ్చుకున్నారన్నావ్ !''

''అవును ! ఇన్నాళ్లూ మెచ్చుకున్నారు. అంత గొప్ప థీసిస్ లేదన్నారు. కానీ ఈ రోజు బాగా లేదన్నారు. ఇక జీవితంలో నాకు పి.హెచ్.డి. డిగ్రీ రాదు. శోభా ! మూడేళ్ల నిద్రాహారాలు మాని నేను చేసిన శ్రమంతా వృథా అయింది. నా ఆశలు – కలలు అన్నీ నాశనమయ్యాయి. ఇక నేనెందుకూ పనికిరాను.''

మోచేతి వంపులో ముఖం దాచుకున్నాడు శ్రీరామ్ ! అతడిని ఎలా ఓదార్చాలో ఆమెకు అర్థం కాలేదు.

''రామ్ రిసెర్చి డిగ్రీ లేకపోతే ఏం ! నీ యూనివర్సిటీ డిగ్రీ వుంది కదా !'' శోభ ఓదార్పుగా అంది.

''శోభా ! మా ప్రొఫెసర్‌గారి పలుకుబడి నీకు తెలీదు. ఆయన తలుచుకుంటే నాకు చిన్న ఉద్యోగం కూడా రాకుండా చెయ్యగలడు. నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న నా వాళ్లకు ముఖం ఎలా చూపగలను. నలుగురూ హేళన చేస్తుంటే ఎలా తట్టుకోగలను. అసలు నేనిక ఎందుకు బ్రతకాలి ?'' ఆవేదనగా అన్నాడు.

శోభ చలించి పోయింది. ఆమె మనస్సు సంక్షోభానికి గురయింది.

పవిత్రమైన విద్యకు మాత్రమే స్థానాలుగా వుండాలిసిన విద్యాలయాలు, కుల తత్వాలకు,

ముఠా రాజకీయాలకు, స్వార్ధపూరితమైన ప్రయోజనాలకు నిలయాలుగా వున్నాయి. ప్రతిభకు స్థానంలేదు. కాకారాయుళ్లకే అన్ని అవకాశాలు. అందుకే ఎంతోమంది విద్యావంతులు నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

శ్రీరావ్ కూడా...

శోభ ఆపైన ఆలోచించలేకపోయింది. గుండె పట్టేసినట్లయింది.

"శోభా ! నామీద ఎన్నో ఆశలు పెట్టుకుని వుంటావ్. కానీ నేను నీ జీవితాన్ని కూడా నాశనం చెయ్యబోతున్నాను. నన్ను క్షమించు." శ్రీరావ్ కంఠం రుద్ధమైంది.

"శ్రీరావ్ ! ఆయనకి మన సంగతి చెప్పావా ?"

"ఎందుకు చెప్పలేదు. ఆ మర్నాడే ఆయన ఇంటికి వెళ్లి చెప్పాను. ప్రాధేయపడ్డాను. కానీ విన్పించుకోలేదు. ఆయన అనుకున్నది జరగాలట. శోభా ! ఇంతవరకూ నాణేనికి ఒక ప్రక్కే చూశాను. ఇక ఇప్పుడు రెండో ప్రక్క చూడబోతున్నాను !"

శోభ చిన్నగా నిట్టూర్చింది.

లోకంలో ఏ తండ్రయినా తన కూతుర్ని ఇష్టపడే వ్యక్తికిచ్చి వివాహం చేస్తాడు. అంతే కానీ ఇలా బలవంతపు పెళ్లి చేస్తాడా ? విద్యలో ఆచార్య స్థానాన్ని పొందినా, సంస్కారంలో మాత్రం అతి తక్కువ స్థాయిలో వున్నాడు. ఆయనేకాదు. నేటి విశ్వవిద్యాలయాల్లోని అనేక మంది గురువులు అలాగే ప్రవర్తిస్తున్నారు. వాటి గురించి తను తరుచు పేపర్లల్లో చదువుతోంది. కానీ ప్రత్యక్షంగా మాత్రం ఇప్పుడు చూస్తోంది.

"శోభా ! నా కిప్పుడు రెండే మార్గాలు వున్నాయి. ఆయన చెప్పినట్లు వినడం. లేకపోతే ఈ జీవితాన్ని అంతం చేసుకోవడం. మొదటిది చెయ్యలేను. ఇక మిగిలింది రెండోదే !"

"శ్రీరావ్ !" భయం భయంగా అంది.

శ్రీరావ్ శుష్కహాసం చేశాడు.

"ఎందుకు శోభా ! అంత కంగారు పడతావ్ ! ఈ సంవత్సరంతో నా జీవితం కొత్త మలుపు తిరుగుతుందని ఆశపడ్డాను. చూశావా ఎటువంటి మలుపు తిరిగిందో ?"

శ్రీరావ్ కళ్లల్లో అంతులేని దిగులు — దానితోపాటు ఏదో స్థిరనిశ్చయానికొచ్చినట్లున్న ఆవేశం — శోభని విచలితురాలిని చేసింది.

శ్రీరావ్ నిజంగా ఏదో అఘాయిత్యం చేసేట్లున్నాడు ! "కానీ అతడిలాటి మేధావి చనిపోకూడదు. అతని వలన దేశానికి ఎంతో మేలు కలగాలి" అనుకుంది శోభ.

"శ్రీరావ్ ! ఇన్నాళ్ల మన స్నేహంలోనూ నన్నేమీ అడగలేదు ! నాదో చిన్న కోరిక వుంది తీరుస్తావా ?" అనడిగింది మెత్తగా.

## అందరూ ఇలాగ ఉంటే....

"ఏమిటది శోభా !"

"మాటివ్వు ! చెప్తాను !"

"అలాగే శోభా ! నా ప్రాణాన్ని రుణంగా పెట్టయినా తీరుస్తాను. కనీసం నీ కోరికన్నా తీర్చగలిగితే నేను ధన్యుడినే !"

క్షణం ఆగి మెల్లగా అంది.

"శ్రీరావ్ ! నువ్వు మీ ప్రొఫెసరుగారమ్మాయిని పెళ్లి చేసుకోవాలి! అదే నా కోరిక!"

శ్రీరావ్ తెల్లబోయాడు.

"అవును రావ్ ! నాకు మాటిచ్చావు ! తప్పదు !" అంది.

శ్రీరావ్ తల అడ్డంగా వూపుతూ "నా వల్లకాదు," అన్నాడు.

"ఎందుకు కాదు ! మొదట్లో బాధగానే వుంటుంది ! కాదనను; కానీ కాలమే అన్ని గాయాల్ని మాన్పుతుంది !"

శ్రీరావ్ ముఖం ఎర్రబడింది.

"శోభా ! నా ప్రేమను శంకిస్తే నేను సహించలేను " అన్నాడు తీవ్రంగా !

శోభ నొచ్చుకుంటూ —

"రావ్ ! అదికాదు నా వుద్దేశం ! నీ మేధస్సు, విజ్ఞానం ప్రజలకు వుపయోగపడాలి. నీలాటివాడు నిరాశా నిస్పృహలతో క్రుంగిపోకూడదు ! వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకో ! నువ్వు నలుగురికి ఉపయోగపడేలా జీవించు ! నీ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకు... ప్రేమ కంటే జీవితం ముఖ్యం !" అంది.

### ఆహారం-నేర ప్రవృత్తి!

ఆహారపు అలవాట్లకు, బాలల్లో ఎర్పడే నేరపు వృత్తికి సంబంధమున్నట్లు జపాను మనస్తత్వ శాస్త్రవేత్త ఒకరు తెలియచేశారు. గత పదకొండు సంవత్సరాలుగా బాలల నేర ప్రవృత్తిని పరిశీలిస్తున్నారు. ఆయన పరిశీలించిన బాల నేరస్తులందరికీ తియ్యటి ఆహార పానీయం అంటే చాలా ఇష్టం. వీరి భోజన అలవాట్లు సక్రమంగా ఉండేవికాదు. భోజనానికి, భోజనానికి మధ్యలో తీపి పదార్థాలను ఎక్కువగా తినేవారు. భోజన అలవాట్లు సక్రమంగా లేకపోవటంవలన, ఎక్కువగా తీపి పదార్థాలు భుజించటం వలన, కాల్షియం, బి. వన్ విటమినులు నశిస్తాయని ఆయన అన్నారు. బి. వన్ విటమిన్ లోపంవలన జతువులలో మానసిక విపరీతాలు ఏర్పడినట్లు ఆయన తెలియచేస్తూ, మానవులలోకూడా ఇదేవిధంగా జరగగలదని ఆయన అన్నారు.

"త్యాగం చేస్తున్నావా ?" కసిగా అన్నాడు. శోభ నవ్వింది.

"లేదు ! అదృష్టం తలుపుతట్టి పిలిస్తే తలుపు తెరిచి ఆహ్వానించమంటున్నాను. కీర్తి ప్రతిష్టలు సంపాదించమంటున్నాను. నా శ్రీరావ్ నలుగురిలో పేరుప్రతిష్ఠలు పొందాలనుకొనడం స్వార్థం అవుతుంది కానీ త్యాగం కాదు !"

"శోభా... !"

"ఇంకేం చెప్పకు ! నామీద ఒట్టే ! నువ్వు కాదంటే నామీద నీకు ప్రేమ లేదనుకుంటాను అంతే !" శోభ లేచి చరచరా వెళ్లిపోయింది.

శ్రీరావ్ వుక్కిరిబిక్కిరయ్యాడు. రెండు చేతుల్తో తలపట్టుకుని కూర్చున్నాడు.

కాలేజీలో డిగ్రీ చదివేటప్పుడు ఏర్పడిన ప్రేమ — ఇన్నాళ్లూ భవిష్యత్తు గురించి తామిద్దరూ ఎన్నో కలలు కన్నారు. కానీ ఈనాడవి ఎదురుతిరిగాయి.

ఏం చేయాలిప్పుడు ?

శోభ చెప్పినట్లు చెయ్యడానికి మనస్సు అంగీరరించడంలేదు. శోభ ఎంత బాధని అణచుకుని అలా చెప్పిందో తనకు తెలుసు.

కానీ శోభ ఒట్టుపెట్టుకుంది.

ఎలా ? !

ఈత రానివాడిని సముద్రం మధ్యలో వదిలిపెట్టేసినట్లుంది తన పరిస్థితి !

"తనే తీరానికి కొట్టుకుపోతాడో ! ఇక అదంతా విధి చేతిలోనే వుంది."

శ్రీరావ్ అనుకున్నాడు విచారంగా !

*　　*　　*

ప్రొఫెసరుగారి ఏకైక కుమార్తె పెళ్లంటే యూనివర్శిటీ అంతా తరలి వచ్చింది.

రంగు రంగుల బల్బులతో — పచ్చని తోరణాలతో— పట్టుచీరల రెపరెపలతో— సిల్కు చొక్కాల గరగరలతో పెళ్లిపందిరి సందడిగా— కనులపండువుగా వుంది.

పందిరి మధ్యలో ఎత్తుగా అమర్చిన వేదిక మధ్య — శ్రీరావ్ పెళ్లి బట్టల్లో మెరిసిపోతున్నాడు.

అందరూ శ్రీరావ్ అందాన్ని, అదృష్టాన్ని పొగుడుతున్నారు ! అసూయపడుతున్నారు.

ఆ అందం చాటున లీలగా కదలాడే విషాదం— అది అదృష్టం కాదు తన దురదృష్టమని భావిస్తూ కుమిలిపోతున్న అతని మనస్సు ఆ లైటు వెలుగుల్లో ఎవరికీ కనబడడంలేదు.

పెళ్లి తంతు జరిగిపోతోంది.

పెళ్లికుమార్తె వచ్చి అతని ప్రక్కన కూర్చుంది. శ్రీరావ్ మనస్సూ, శరీరం మొద్దుబారిపోయాయి. యాంత్రికంగా పురోహితుడు చెప్పినట్లు చేస్తున్నాడు.

చుట్టూ చేరిన అతని స్నేహితులు చేసే పరిహాసాలు కానీ, నవ్వులు కానీ అతడు పట్టించుకోవడంలేదు. చైతన్యరహితమైన అతని

# ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య



## త్రికరణశుద్ధి

మనస్సు, మాట, శరీరము అనే మూడూ త్రికరణములు. ఈ మూడూ పరిశుద్ధంగా ఉండడమే త్రికరణశుద్ధి. అంటే — మనస్సులో ఎలాటి ఉత్తమాశయం తోస్తుందో, మాటకూడా, ఆ అభిప్రాయానికి అనుకూలంగానే ఉండాలి. శరీరంకూడా దానికి అనుగుణంగానే ప్రవర్తిస్తున్నట్లు చూడాలి. అంతేకాని, ఆలోచించేదొకటీ, చెప్పేదొకటీ, చేసేదొకటీ కాకూడదు.

స్నానంచేసి, పరిశుభ్ర వస్త్రాలు ధరించి ఇంట్లో ఉన్న దేవతా విగ్రహాలకు పూజచేస్తూ ఉన్న వ్యక్తి భగవన్నామాలు ఉచ్చరిస్తూ, విగ్రహాలపయి పువ్వులు వేస్తున్నాడనుకుందాం. ఆ సమయంలో ఇంట్లో పిల్లలు గోలచేస్తూ ఉంటే ''ఏమిటా గోల ? ఊరుకుంటారా, లేదా ?'' అని కసురుకుంటూవుంటే — ఆతని మనస్సుకూ, చేస్తున్న పూజకూ సంబంధం లేకుండా పోతుంది. ఎలాటి ధ్వనులు వినవచ్చినా మనస్సును వాటిపైకి పోనీయకుండా ఉంటే తదేకధ్యాన నిష్ఠలో ఉన్నవారికి అవి వినబడనేవినబడవు.

ఆ విధంగానే — పూజచేస్తూ ఉన్న సమయంలో భార్యను పిలిచి ''వంట అయిందా? వేగంగానే పూజ ముగిస్తాను. అన్నం వడ్డించు. ఈ రోజు ఆఫీసుకు చాలా తొందరగా వెళ్లాలి'' అని అంటూ నామావళిని చదివి పూజ చేసే వారికి మనస్సు దేవునిపైనే ఉంటుందనీ, ఏదో పేరునకు పూజ చెయ్యడమేకాని, పూజయందు ఆసక్తి ఉంటుందనీ అనుకోలేము.

త్రికరణశుద్ధి ఇతర విషయాల్లో కూడా ఉండాలి. లేకపోతే ఇతరులను మోసగించినట్లే అవుతుంది. ఇతరులకు ఉపకారం చెయ్యగల పదవిలో ఉన్న వ్యక్తిని ఆశ్రయించి ఒకడు తనకు ఉపకారం చెయ్యవలెనని ప్రాధేయపడతాడనుకుందాం. ''తప్పకుండా నీకు ఉపకారం చేస్తాను'' అని ఆ అధికారి వాగ్దానం చేసి కూడా ఉపేక్ష వహించడం, ఆశ చూపుతూ పదిసార్లు తన వెంట త్రిప్పుకోవడం సాధారణంగా కానవస్తూ ఉంటుంది. ''నీ వెనుక యిన్నిసార్లు అతణ్ణి ఎందుకు త్రిప్పుకుంటావు ? చేస్తానన్న ఉపకారంచేసి పంపి వెయ్యరాదా ?'' అని చనువున్న వారెవరైనా ప్రశ్నిస్తే ''ఏదో మాట వరసకు అన్నానేకాని, ఉపకారం చెయ్యాలనే పట్టుదల లేదు. ఏదో ప్రయత్నిస్తానుగాని, హామీ యివ్వలేను'' అని సమాధానం చెప్పవచ్చు. అప్పుడు మనస్సుకూ, మాటకూ పొందిక కుదరదు.

ఇలాటి సంఘటనలు ఎన్నయినా ఉండవచ్చును. ఇలాటివి త్రికరణశుద్ధి లేనివి. త్రికరణశుద్ధిలేని వ్యక్తికి గౌరవం ఉండదు. వ్యక్తికి జీవితంలో ''త్రికరణశుద్ధి'' అతి ముఖ్యమైనది.

## అందరూ ఇలాగ ఉంటే....

మనస్సూ, శరీరం ఏదో లోకంలో విహరిస్తున్నాయి.

పురోహితుడు మంగళసూత్రాలు అందించాడు. శ్రీరామ్ తూలిపోతున్న శరీరాన్ని, మనస్సునీ అదుపులో పెట్టుకుంటూ, ఉబికి వస్తున్న కన్నీటిని రెప్పల మధ్య దాచుకుంటూ మెల్లగా లేచాడు.

పెళ్లికూతురి మెడలో మూడుముళ్లూ వేశాడు. ''అయిపోయింది— అంతా పూర్తయిపోయింది— సంసార జీవితాన్ని గూర్చి తను కన్న కలలు—ఆశలు భగ్నమైపోయాయి. ఈ క్షణం నుండీ తను శోభ ప్రియుడు కాదు—ప్రొఫెసరుగారి అల్లుడు!'' విషాదంగా నవ్వుకున్నాడు శ్రీరామ్.

ఏదో పెద్ద అలజడి వినిపిస్తే కళ్లు తెరిచాడు.

''ఆగండి ఈ పెళ్లి ఆపండి!'' అరుస్తూ ప్రొఫెసరుగారు పరుగు పరుగున వస్తున్నారు.

అది చూసి శ్రీరామ్ ఆశ్చర్యపడ్డాడు. 'ఏం జరిగింది !' అనుకుంటూ యాదాలాపంగా ప్రక్కకు తిరిగి చూసి అదిరిపడ్డాడు.

పెళ్లికూతురి స్థానంలో శోభ వుంది ఆమె మెడలో తను క్షణం క్రితమే మూడు ముళ్లూ వేసిన పచ్చని తాళి మెరుస్తోంది.

ఇది కలా. నిజమా. అనుకుంటూ ఆ షాక్ నుండి తేరుకోలేకపోయాడు చాలాసేపటివరకూ.

'అంతా మోసం. దగా!'' ప్రొఫెసరుగారు శ్రీరామ్‌మీద చెయ్యెత్తబోయారు కోపంగా.

''నాన్నా !''

ఆ కేకతో పందిరి అదిరిపోయింది. అంతా స్థాణువుల్లా నిలిచిపోయారు.

ప్రొఫెసరుగారి కుమార్తె అపర కాళిలా నిలబడింది. తండ్రివేపు కోపంగా చూస్తూ--

''నాన్నా. ఆయన చేసిన మోసం—దగా ఏమీలేదు. ఆయన అమాయకుడు'' అంది.

''కాదు తల్లీ ! నన్ను వంచించి...''

''ఎవరు ఎవర్నీ వంచించలేదు. అతనికిదేమీ తెలీదు నేనే ఈ నాటకం ఆడాను !''

''రూపా !'' ప్రొఫెసరుగారి ముఖం వెలవెల బోయింది.

''అవును నాన్నా ! స్వార్థబుద్ధితో నాకూ, అతనికీ కూడా ఇష్టంలేని పెళ్లి చేయబోయావు. శోభ నాకు తెలుసు. ఆమె సహాయంతో ఇలా నేనే నాటకం ఆడాను. ఇది మా ఇద్దరికీ తప్ప ఇంకెవ్వరికీ తెలీదు. చివరివరకు రహస్యంగానే వుంచాను. శ్రీరామ్‌కి పి. హెచ్. డి. డిగ్రీ, వుద్యోగం వచ్చాకే చేసుకుంటానని నీతో చెప్పి ఆ రెండు అతనికి వచ్చేలా చేశాను. చివరికి శోభతో పెళ్లి జరిపించాను.''

ఆమె మాటలు వింటూ అంతా ఆశ్చర్యంగా ప్రొఫెసరుగారివేపు చూడసాగారు. వాళ్ల చూపులకు తట్టుకోలేకపోయారు.

''నాన్నా ! ఎంతోమంది విద్యార్థులకు విద్యాదానం చేసి వాళ్లను వెలుగుబాటలో నడిపించాల్సిన మీరే — చీకటిదారిలో నడిస్తే ఎలా ? మీకేకాదు. మీలాటి గురువులందరికీ ఇటువంటి అవమానం జరగాలి. అప్పుడే మన సరస్వతీ విద్యాపీఠాలు బాగుపడతాయి.''

ప్రొఫెసరుగారు అవమానంతో తలొంచుకున్నారు.

''నాన్నా ! మీ స్వార్థాన్ని నా మోసంతో జయించాను. ఎంతయినా మీ కూతురిని కదా !'' అంటూ రూప కొత్త దంపతులవేపు చూసి నవ్వింది.

ఆమె నవ్వు — వారి మనస్సుల్లో పూల పొదరిళ్లు వేసింది ! ★